క్లుప్తంగా

కంటి వైద్య శిబిరం



లింగంపేట(ఎల్లారెడ్డి): ముంబోజిపేట జీపీలో బుధవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో మోతిబిందు శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి వైద్య నిపుణుడు హరికిషన్ రావు మోతిబిందు పరీక్షలు చేశారు. 13 మందికి మోతిబిందు ఉన్నట్లు గుర్తించి ఆపరేషన్ కోసం లయన్స్ కంటి ఆస్పత్రికి పంపినట్లు తెలిపారు. సర్పంచ్ స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రాల తనిఖీ



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఉత్తునూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల ఆరోగ్య ఉప కేంద్రాలను బుధవారం ఐఎంఐ అధికారుల బృందం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. డీఐవో అనిల్ కుమార్, వైద్యుడు సాయికుమార్, ఏఎన్ఎం రజిత, భాగ్యశ్రీ పాల్గొన్నారు.

పంటల పరిశీలన

గాంధారి(ఎల్లారెడ్డి): పోతంగల్ ఖుర్దు, మాతుసంగెంలో బుధవారం పర్యటించి క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించినట్లు ఏవో నరేష్ తెలిపారు. పత్తి పంటలో రసం పీల్చే పురుగు, వరిలో కాండం తొలిచే పురుగు ఆశించినట్లు గుర్తించామని తెలిపారు. కొన్ని రోజులుగా వర్షాలు లేనందున పంటలు బిరుసుకు పోయాయని.. పంటలను కాపాడుకోడానికి 13:0:45ని ఎకరానికి ఒక కిలో చొప్పున పిచికారీ చేసుకోవాలని ఏవో సూచించారు.

గోపాల్‌పేట్‌లో పారిశుధ్య పనులు..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేటలో చేపట్టిన పారిశుధ్య పనులను బుధవారం ఎంపీవో శ్రీనివాస్ పరిశీలించారు. పెట్రోల్‌బంకు సమీపంలో జేసీబీతో మురికికాలువలను శుభ్రం చేయించే పనులను ఆయన పర్యవేక్షించారు. గ్రామంలో నీటినిల్వలు ఉన్నచోట ఆయిల్‌బాల్స్ వేయించాలని చెప్పారు. కార్యదర్శి భూమేశ్వర్ ఉన్నారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా నక్క రవీందర్



బీబీపేట: జిల్లా అధ్యక్షులు అరుణతార ఆదేశాల మేరకు బీజేపీ మండలాధ్యక్షుడిగా మాందాపూర్ గ్రామానికి చెందిన నక్క రవీందర్‌ను నియమించినట్లు అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి బుధవారం తెలిపారు. పార్టీ ఆదేశాలకు అనుగుణంగా పార్టీ కోసం కొన్నేళ్లుగా పని చేస్తున్న నక్క రవీందర్‌ను ఎన్నిక చేశామన్నారు. రవీందర్ మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం కృషి చేస్తానని అన్నారు.

బాన్సువాడ డిపో మేనేజర్‌గా సరితాదేవి



బాన్సువాడ రూరల్: బాన్సువాడ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న సదాశివ్ బదిలీపై వెళ్లడంతో బుధవారం సరితాదేవి బాధ్యతలు స్వీకరించారు. అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. డిపో విషయాలపై చర్చించారు.

స్పోర్ట్స్ కిట్ అందజేత



రాజంపేట: తలమడ్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు బుధవారం గ్రీన్‌కో సోలార్ ప్లాంట్ యాజమాన్యం ఆధ్వర్యంలో పాఠశాలకు స్పోర్ట్స్ కిట్‌ను అందజేశారు. వీటిలో వాలీబాల్ సెట్స్(3), క్యారం బోర్డు(2), టెన్నికాయిట్(4), చెస్(3), షార్ట్ పుట్(4), షటిల్ బ్యాట్స్(6) ఉన్నాయి. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి రవిచంద్ర, సర్పంచ్ యాదవరెడ్డి, ఎంపీటీసీ రాజు, ఎస్ఎంసీ చైర్మన్ స్వామి, శ్రీనివాస్ గౌడ్, అంజిల్ రెడ్డి పాల్గొన్నారు.

‘గృహలక్ష్మి’ కోసం పరుగులు

- ధ్రువపత్రాలు లేకుండా దరఖాస్తులు
- సెలవు రోజు కూడా అర్జీల స్వీకరణ
- గడువు పెంచాలంటున్న దరఖాస్తుదారులు



బాన్సువాడ మున్సిపాలిటీలో దరఖాస్తు చేస్తున్న మహిళ

బాన్సువాడ: సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోలేని పేదలకు ఆసరాగా నిలిచి వారి సొంతగూటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రభుత్వ ఉద్దేశం మంచిదే కానీ దరఖాస్తు చేసుకునేందుకు తక్కువ సమయం ఉండటంతో ఆశావహులు లబోదిబోమంటున్నారు. శనివారమే చివరి రోజు కావడంతో చాలా మంది ఉరుకులు, పరుగులతో దరఖాస్తు చేసుకుంటున్నారు. దరఖాస్తు ఫారానికి కులం, ఆధాయ ధ్రువీకరణ పత్రాలు జతచేయాలని అధికారులు సూచించినా చాలా మంది అవి లేకుండానే దరఖాస్తు చేసుకుంటున్నారు. బాన్సువాడ మున్సిపాలిటీతో పాటు 23 గ్రామ పంచాయతీల్లో దరఖాస్తులు తీసుకుంటున్నారు. రెండో శనివారం సెలవు, ఆదివారం, మంగళవారం పంద్రాగస్టు సెలవు రోజుల్లో కూడా దరఖాస్తులు స్వీకరించారు. ఒక్క బాన్సువాడ మున్సిపాలిటీలోనే ఇప్పటి వరకు 150 వరకు దరఖాస్తులు వచ్చాయి. కులం, ఆదాయం సర్టిఫికెట్లు లేకుండానే దరఖాస్తులు చేస్తున్నారని అధికారులు చెబుతున్నారు. కులం, ఆదాయం సర్టిఫికెట్లు తీసుకోవడానికి కనీసం వారం రోజుల సమయం పడుతుందని, వరుసగా ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు రావడంతో అధికారులు అందుబాటులో లేరని దరఖాస్తుదారులు చెబుతున్నారు. ధ్రువీకరణ పత్రాలు లేకుండానే దరఖాస్తు చేసుకుంటున్నామని పేర్కొంటున్నారు. ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణకు సమయం పెంచాలని కోరుతున్నారు.

భారీగా దరఖాస్తులు..

తెలంగాణలో బాన్సువాడ నియోజకవర్గంలోనే అత్యధికంగా డబుల్ బెడ్ రూం ఇళ్లు అందజేశారు. గృహలక్ష్మి పథకం కోసం దరఖాస్తులు భారీగానే వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. వారం రోజుల్లో విచారణ జరిపి అర్హులను ఎంపిక చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

అర్హులను ఎంపిక చేస్తాం



ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం దరఖాస్తులను స్వీకరిస్తున్నాం. ప్రతి రోజూ చాలా మంది దరఖాస్తులు తీసుకువస్తున్నారు. అందరి దరఖాస్తులు స్వీకరించి విచారణ చేసి అర్హులైన వారిని పథకానికి ఎంపిక చేస్తాం.

– జంగం గంగాధర్, మున్సిపల్ చైర్మన్, బాన్సువాడ

మాజీ ప్రధాని వాజ్‌పేయికి ఘన నివాళులు



జిల్లా కేంద్రంలో వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



ఎల్లారెడ్డిలో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



లింగంపేటలో ..

సాక్షి నెట్‌వర్క్: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి కార్యక్రమం బీజేపీ ఆధ్వర్యంలో పలు చోట్ల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశం కోసం ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. వాజ్‌పేయి ఆశయ సాధనకు ప్రతి బీజేపీ కార్యకర్త పాటుపడాలని నేతలు పిలుపునిచ్చారు. మహిళా సాధికారత, సామాజిక సమానత్వం కోసం పాటుపడిన వ్యక్తి అని బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. ఆయన కృషి వల్లే భారతీయ జనతా పార్టీ ఒంటరిగా అధికారంలోకి రాగలిగిందన్నారు. ఆయన బాటలో ప్రతీ ఒక్క కార్యకర్త నడవాలని పిలుపునిచ్చారు.



భిక్కనూరులో..



దోమకొండలో..

మూఢ నమ్మకాలపై అవగాహన



సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డి ఉన్నత పాఠశాలలో బుధవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్సై నర్సయ్య మాట్లాడుతూ.. మూఢ నమ్మకాలు వీడాలన్నారు. బాల్య వివాహాలు చేయడం నేరమని, ఎక్కడైనా జరిగితే 100 నంబర్‌కు డయల్ చేయాలన్నారు. మైనర్లు వాహనాలు నడపొద్దన్నారు. పోలీస్ సిబ్బంది దేవరాజు, రామాంజనేయులు, కళాబృందం ప్రతినిధులు రవి, సాయిలు, వెంకట్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే దళిత బంధు అందేలా చూడాలని వినతి



దోమకొండ: దళిత బంధు పథకం అర్హులకే అందజేయాలని మాల సంఘం సభ్యులు కోరారు. బుధవారం సంఘానికి చెందిన మహిళలు, పురుషులు గ్రామ పంచాయతీ వద్దకు చేరుకుని తమలో అర్హులైన వారికి దళిత బంధు ఇవ్వాలని కోరారు. ఈ విషయాన్ని వెంటనే సర్పంచ్ నల్లపు అంజలి బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంధ్ర మధుసూదన్‌రావుకు ఫోన్‌లో వివరించారు. రెండు రోజుల్లో కాలనీలో సర్వే నిర్వహించి అర్హుల జాబితాను ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌కు అందేలా చూద్దామని ఆయన తెలిపారు.

పెండింగ్ ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలి



కరపత్రాలను అందజేస్తున్న టీజేఎస్ నాయకులు

ఎల్లారెడ్డి: నియోజకవర్గంలో పెండింగ్ ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలని టీజేఎస్ నాయకులు, ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి నిజ్జన రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం అన్నాసాగర్‌లో రైతులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోచారం ప్రాజెక్టు ఎత్తు పెంపు కోసం పాదయాత్ర చేసిన ఎమ్మెల్యే సురేందర్ నేడు ప్రాజెక్టు ఎత్తు పెంపు విషయాన్ని విస్మరించారని అన్నారు. సదాశివనగర్ మండలంలోని భూంపల్లి వద్ద ప్రాజెక్టు నిర్మాణం పనులు పూర్తి కాలేదన్నారు. నాయకులు లక్ష్మణ్, పూల్‌సింగ్, తదితరులున్నారు.

సేవా భారత్ అవార్డు అందజేత



అవార్డు అందుకుంటున్న ప్రతిభ

పిట్లం(జుక్కల్): హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో తెలంగాణ భాష, సాంస్కృతిక శాఖ, ఎస్ఎండీసీ సౌజన్యంతో హెవెన్ హోమ్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం సేవా భారత్ అవార్డుల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిట్లంలోని ప్రతిభ హైస్కూల్ నిర్వాహకులు శ్యామల నర్సింగ్‌రావుల కుమార్తె ప్రతిభకు సేవా భారత్ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ప్రతిభ తండ్రి నర్సింగ్‌రావ్ మాట్లాడుతూ.. ప్రతిభ అంతర్జాతీయ స్థాయిలో చెస్ బాక్సింగ్, బాక్సింగ్ పోటీల్లో రాణిస్తూ అనేక బంగారు పతకాలు సాధించిందని, పేద విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్, స్వీయ రక్షణలో ఉచితంగా శిక్షణ ఇస్తూ అమ్మాయిలకు ఆదర్శంగా నిలుస్తున్నందుకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ అవార్డు అందించారని తెలిపారు.

సంక్షిప్తం

జీపీ రికార్డుల పరిశీలన

నస్రుల్లాబాద్(బాన్సువాడ): నాచుపల్లి జీపీని ఎంపీవో రాము ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటి, నల్లా బిల్లుల వసూలు, నిధుల వినియోగానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి విఠల్ ఉన్నారు.

‘జాతీయ జెండాకు అవమానం జరగలేదు’

బాన్సువాడ: పంద్రాగస్టు రోజున బాన్సువాడ మున్సిపాలిటీలో జాతీయ జెండాకు ఎలాంటి అవమానం జరగలేదని మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ..తనపై రాజకీయ కక్షతోనే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు.

‘రుణాలు రెన్యువల్ చేసుకోవాలి’

బిచ్కుంద(జుక్కల్): వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులు రెన్యువల్ చేసుకోవాలని బండరెంజల్ సర్పంచ్ గడ్డం బాల్‌రాజ్ తెలిపారు. బుధవారం గ్రామస్తులతో జీపీలో సమావేశం ఏర్పాటు చేశారు. బండరెంజల్ రైతులు పుల్కల్ బ్యాంక్ వెళ్లి రుణాలను రెన్యువల్ చేసుకోవాలని సూచించారు.

20వ రోజుకు చేరిన ఎంపీటీసీ దీక్ష

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): అన్నాసాగర్ ఎంపీటీసీ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంపీటీసీ ఉమాదేవి చేస్తున్న రిలే నిరాహార దీక్ష బుధవారానికి 20వ రోజుకు చేరుకుంది. సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు దీక్షను కొనసాగిస్తానని ఎంపీటీసీ తెలిపారు.

ఉప్పల్‌వాయి పల్లెదవాఖానా సందర్శన

రామారెడ్డి(ఎల్లారెడ్డి): ఉప్పల్‌వాయి పల్లె దవాఖానాను రామారెడ్డి వైద్యాధికారి సురేష్ బుధవారం సందర్శించారు. మిషన్ ఇంద్ర ధనస్సులో భాగంగా పల్లె దవాఖానాను సందర్శించి వ్యాధుల నివారణకు చేపట్టే ముందు జాగ్రత్తలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. పల్లెదవాఖాన డాక్టర్ రమ్య శ్రీ, హెల్త్ ఎడ్యుకేటర్ భీమ్ పాల్గొన్నారు.

పశువులకు ‘గాలికుంటు’ నివారణ టీకాలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఉత్తునూర్‌లో బుధవారం పశువైద్య శాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. పాల కేంద్రం అధ్యక్షుడు దొడ్లె రవి మాట్లాడుతూ...గ్రామంలోనిపశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని సూచించారు. పశుగణ సహాయకుడు జుగల్ కిషోర్, సర్పంచ్ మోతె సాయవ్వ, తదితరులు పాల్గొన్నారు.

సీఎం, ప్రభుత్వ విప్ చిత్రపటాలకు పాలాభిషేకం



భిక్కనూరు: మండల కేంద్రంలో బీటీరోడ్డు నిర్మాణానికి ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ రూ.కోటి ఐదు లక్షల నిధులు మంజూరు చేయడంతో పాత దళితవాడ కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం, ప్రభుత్వవిప్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. టపాకాయలు కాల్చుతూ ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు.

డెయిరీ కళాశాల ఔట్ సోర్సింగ్ సిబ్బంది కార్యవర్గం

కామారెడ్డి అర్బన్: పీవీ నర్సింహారావు కామారెడ్డి డెయిరీ కళాశాల ఔట్ సోర్సింగ్ సిబ్బంది కార్యవర్గం ఎన్నిక బుధవారం జరిగింది. అధ్యక్షుడిగా కాసర్ల లింగం, ఉపాధ్యక్షులుగా శంకర్, సీహెచ్ రవి, తదితరులు ఎన్నికయ్యారు.

ఇళ్ల స్థలాలు ఇప్పించండి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తమకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరుతూ నాగిరెడ్డిపేట, గోపాల్‌పేట గ్రామాలకు చెందిన బీడీకార్మికులు స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. నిరుపేదలమైన తమకు సొంతిల్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని ఈ సందర్భంగా వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి స్థలాలు ఇప్పించే ప్రయత్నం చేస్తానని జెడ్పీటీసీ పేర్కొన్నారు.

కొనసాగుతున్న పార్ట్‌టైం స్వీపర్ల రిలే దీక్షలు

కామారెడ్డి రూరల్: తమ న్యాయమైన డిమాండ్‌లను నెరవేర్చాలని కోరుతూ కామారెడ్డి ఆర్డీవో కార్యాలయం వద్ద పార్ట్‌టైం స్వీపర్లు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 52వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పార్ట్‌టైం స్వీపర్ల ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు బాలయ్య మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. 52 రోజులుగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విడ్డూరమన్నారు. పార్ట్‌టైం స్వీపర్లు సిద్ధిరాములు, మునీరోద్దీన్, గంగయ్య, మల్లేషం, సరోజ, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సిద్ధరామేశ్వరాలయంలో శ్రావణ మాసోత్సవాలు

భిక్కనూరు: దక్షిణ కాశీగా పేరొందిన భిక్కనూరు సిద్ధరామేశ్వరాలయంలో శ్రావణమాసం ఉత్సవాలను ఈనెల 17 నుంచి సెప్టెంబర్ 14 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ అందె మహేందర్‌రెడ్డి, ఈవో శ్రీధర్, మహంత్ సదాశివలు బుధవారం తెలిపారు. శ్రావణ మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు.

అపరాజిత విద్యా యాగంతో విజయం ప్రాప్తి

ఎల్లారెడ్డి: శ్రీ అపరాజిత విద్యా యాగంతో విజయం ప్రాప్తిస్తుందని జ్యోతిర్వాస్తు విద్యా పీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ మహేశ్వర శర్మ సిద్ధాంతి అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి పట్టణంలోని వైశ్య భవన్‌లో శ్రీ అపరాజితా విద్యా యాగ పత్రాలను భక్తులకు అందించారు. అనంతరం సిద్ధాంతి మాట్లాడుతూ.. ఈనెల 25 నుంచి 27 వరకు సంగారెడ్డిలోని జ్యోతిర్వాస్తు విద్యా పీఠంలో శ్రీఅపరాజితావిద్యా యాగార్చన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

అభివృద్ధి చేయని అధికారులు ఎందుకు?

- సర్వసభ్య సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేసిన సభ్యులు
- సమావేశంలో సభ దృష్టికి సమస్యలు తెచ్చినా పరిష్కారం కావడం లేదని ఆరోపణ



తాడ్వాయిలో మాట్లాడుతున్న ఎంపీపీ కొడి రవి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): గ్రామాలను అభివృద్ధి చేయని అధికారులు ఎందుకని, ప్రతిసారి సమావేశాలలో సమస్యలు సభదృష్టికి తెచ్చినా పరిష్కారం కావడంలేదని ఎంపీటీసీలు, సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ కొడిరవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దేమికలాన్, కరడ్‌పల్లి, క్రిష్టాజీవాడి, చిట్యాల, ఎర్రాపహాడ్ గ్రామాలలో కరెంటు సమస్యలతో బాధపడుతున్నామని సర్పంచ్‌లు బాలచంద్రం, పోరాజు, ఎంపీటీసీ జలందర్‌రెడ్డి, రాజమణి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరాయని, వైర్లు కూడా కిందకు వేలాడుతున్నాయని దీంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ట్రాన్స్‌కో సబ్ ఇంజనీర్ భాస్కర్‌ను నిలదీశారు. చిట్యాల గ్రామంలో రోజుకు, మూడు,నాలుగు గంటల పాటు కరంటు ఉండంలేదని దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదర్కొంటున్నారని ఎంపిటీసీ రాజమణి, సర్పంచ్ కవితలు సభదృష్టికి తెచ్చారు. మిషన్ భగీరథ ద్వారా త్రాగు నీరు సక్రమంగా సరఫరా కావడంలేదని ఎన్ని సార్లు చెప్పినా ఏఈలు వినోద్, బాలకిషన్ పట్టించుకోవడం లేదని సర్పంచ్ బాలచంద్రం, ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. అలాగూ పలు సమస్యలు సర్వసభ్య సమావేశంలో సభదృష్టికి తీసుకొచ్చారు. ఎంపీడీవో రాజ్ వీర్, తహసీల్దార్ సునీత, వైస్ ఎంపీపీ నర్సిములు, జెడ్పీటీసీ రమాదేవి, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిరెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ కపిల్‌రెడ్డి, ఏవో శ్రీకాంత్, పశువైద్యాధికారి రాంచంద్రం, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ధర్నాకు తరలివెళ్లిన సమగ్ర శిక్ష ఉద్యోగులు



లింగంపేట నుంచి వెళ్తున్న ఉద్యోగులు



కామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో సమగ్ర శిక్ష ఉద్యోగులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల సమగ్ర శిక్ష ఉద్యోగులు బుధవారం హైదరాబాద్‌లోని ఎస్పీడీ కార్యాలయం వద్ద ధర్నాకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడారు. కామారెడ్డి జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సమగ్ర శిక్షలో 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలని ఎస్పీడీ కార్యాలయాన్ని ముట్టడించినట్లు తెలిపారు. మినిమమ్ టైమ్ స్కేల్, ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు పలు డిమాండ్లు పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. ఉద్యోగులు రాజు, విజయ్, శ్యామల, అశ్విని, సంతోష్‌తో పాటు వందల మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల అరెస్ట్

కామారెడ్డి రూరల్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్‌లో ధర్నాకు వెళ్తున్న కామారెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగులను మార్గ మధ్యంలో కామారెడ్డి పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో బోడ రాములు, శైలజ, మాధవి, కవిత, చిరంజీవి, నాగారాజు, సరోజ, దినేష్, రమాదేవి, భాగ్యలక్ష్మి, భజరంగ్‌లు ఉన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు

- సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న అమర్లబండ గ్రామస్తులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అమర్లబండ గ్రామస్తుల చిరకాల కోరిక నెరవేరింది. నలభై ఏళ్ల నుంచి ఎంతో మంది పాలకులకు బ్రిడ్జిని నిర్మించాలని విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. ఎమ్మెల్యే జాజాల సురేందర్ గత ఎన్నికల్లో గ్రామస్తులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుని శభాష్ అనిపించుకున్నారు. బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.2 కోట్ల 20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలో అమర్లబండ గ్రామస్తులు బుధవారం గ్రామంలో సీఎం, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే జాజాల సురేందర్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. సర్పంచ్ కొత్తూరి లత రాజేశ్వర్, ఎంపీపీ గైని అనసూయ, జెడ్పీటీసీ కమిలి నర్సింలు, ధర్మారవ్‌పేట్ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కిచెన్‌షెడ్లు, ప్రహరీల నిర్మాణానికి..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్‌షెడ్లు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణానికి ఉపాధిహామీ పథకం ద్వారా నిధులు మంజూరైనట్లు ఎంపీపీ రాజ్‌దాస్, జెడ్పీటీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డి తెలిపారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడారు. 14పాఠశాలల్లో కిచెన్‌షెడ్లు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణం కోసం రూ.2 కోట్ల 82లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు.

జన ఆరోగ్య సమితుల ఏర్పాటు



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): జిల్లా వ్యాప్తంగా ఆరోగ్య ఉప కేంద్రాల్లో జన ఆరోగ్య సమితులను(జేఏఎస్) ఏర్పాటు చేస్తున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. కార్యక్రమ ఉద్దేశం గురించి వివరించారు. అన్ని గ్రామాల్లో జేఏఎస్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్‌లో జరిగే జేఏఎస్ సమావేశంలో సంవత్సర కాలంలో చేపట్టిన చర్యలు, నిధుల ఖర్చు వివరాలను తెలపాల్సిన అవసరముందన్నారు. ఎంపీపీ అనసూయ, సర్పంచ్‌లు బద్దం శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, సంగారెడ్డి, బాలకిషన్, ఎంపీటీసీ బీరయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజేందర్, డిప్యూటీ డీహెంహెచ్‌వో శిరీష, పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఆస్మ అఫ్షిన్, సీహెచ్‌వో నాగరాజు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం మాజీ అధ్యక్షుడి అంత్యక్రియలకు స్పీకర్ హాజరు

బాన్సువాడ: బాన్సువాడ రెడ్డి సంఘం మాజీ అధ్యక్షుడు మాసాని గంగారెడ్డి అంత్యక్రియలకు బుధవారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. గంగారెడ్డి పార్థివ దేహానికి నివాళులర్పించారు. మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు . నాయకులు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, పాత బాలకృష్ణ, నర్సన్నచారి ఉన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతాపం తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, కాసుల బాల్‌రాజ్, ఖలేక్, గణేష్, తదితరులు సంతాపం తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కామారెడ్డి & ఎల్లారెడ్డి
96034 62494
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
యం.మధుసూధన్ (ACO) : 99510 27699
డి.యల్.ఎస్.గౌడ్ (ఎల్లారెడ్డి) : 95731 30288
కె.రాజు (కామారెడ్డి) : 99496 99861
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899